క్లుప్తంగా

సీఆర్‌పీఎఫ్ వైద్య సహాయం

చర్ల: మండలంలోని తిప్పాపురం సమీపంలో ఓ రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని సీఆర్‌పీఎఫ్ జవాన్లు వారి క్యాంపునకు తరలించి వైద్య సహాయం అందించారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఆదివారం తిప్పాపురం సమీపంలోని గోరుకొండకు చెందిన వంజం మంగ, ముసికి అడమలు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్నారు. చర్ల మండలంలోని తిప్పాపురం సమీపంలో గల సీఆర్‌పీఎఫ్ 151 బెటాలియన్‌కు సమీపం వద్దకు రాగానే వారి వాహనం అదుపు తప్పి కింద పడ్డారు. సమాచారం అందుకున్న సీఆర్‌పీఎఫ్ 151 బెటాలియన్ క్యాంపు అధికారులు సిబ్బందిని ప్రమాదం జరిగిన ప్రాంతానికి పంపించారు. వారిని క్యాంపుకు తీసుకురాగా క్యాంపు వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్ చికిత్స అందించారు. అనంతరం వారిని సీఆర్‌పీఎఫ్ జవాన్లు తిరిగి ఇంటికి చేర్చారు.

సంఘీభావ పాదయాత్ర

బూర్గంపాడు: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపడుతున్న పాదయాత్ర విజయవంతం కావాలని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బట్టా విజయ్‌గాంధీ ఆధ్వర్యంలో ఆదివారం బూర్గంపాడు నుంచి భద్రాచలం రామయ్య చెంతకు సంఘీభావ పాదయాత్ర చేపట్టారు. బూర్గంపాడు ప్రధానకూడలి నుంచి నాగినేనిప్రోలు, సారపాకల మీదుగా మండల కాంగ్రెస్ శ్రేణులు పాదయాత్రను చేపట్టాయి. ఈ సందర్భంగా విజయ్‌గాంధీ మాట్లాడుతూ.. మేడారం నుంచి రేవంత్‌రెడ్డి చేపట్టనున్న హాత్‌సే హాత్ జోడో అభియాన్ పాదయాత్ర నిర్విఘ్నంగా కొనసాగాలని భద్రాద్రి రామయ్య చెంతకు సంఘీభావ పాదయాత్ర చేపట్టామన్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తెలియజెప్పేందుకు కాంగ్రెస్ శ్రేణులు రేవంత్ పాదయాత్రలో పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. పాదయాత్రలో మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

భద్రాచలంటౌన్: భద్రాద్రి హరిహర క్షేత్రంలో నిర్వహిస్తున్న హరిహర సుతుడు అయ్యప్ప స్వామివారి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారికి శుద్ధిపూజ, కలశ పూజ, అష్టద్రవ్య గణపతి హోమం, ప్రాయశ్చిత హోమం, గాయత్రి హోమం, కలశపూజ, అభిషేకం, నైవేద్యం, హారతి కార్యక్రమాలను శ్రీమాన్ సంజీవన్ తంత్రీ వారి నేతృత్వంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు అరుణ్ రామచంద్ర నంబుద్రి, ఆలయ కమిటీ అధ్యక్షుడు అడుసుమిల్లి జగదీష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తరగతులు నిర్వహించాలి

చంద్రుగొండ: గ్రామీణ వైద్యులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని ఆర్‌ఎంపీ, పీఎంపీల వెల్ఫేర్ అసోసియేషన్ మండలశాఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక భాస్కర ఫంక్షన్‌హాల్‌లో వైద్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో గ్రామీణ వైద్యులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఆ తరహాలోనే శిక్షణ తరగతులను కొనసాగించాలని కోరారు.

మండల కమిటీ ఎన్నిక

గ్రామీణ వైద్యుల సంఘం (ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్) మండల అధ్యక్షుడిగా సీహెచ్.నర్సింహారావు, ప్రధాన కార్యదర్శిగా జి.రమేష్, ఉపాధ్యక్షుడిగా కె.వెంకటేశ్వరరావు, కోశాధికారిగా యండి.నయిం, ప్రచార కార్యదర్శిగా బి.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా బి.భీమానాయక్, నాగిరెడ్డిలను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడు యం.మల్లాచారి, సంఘం జిల్లా నాయకులు ఎస్‌కె.సాబీర్, యం.రామనర్సింహారావు పాల్గొన్నారు.

వెండి వస్తువు వితరణ

అశ్వాపురం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన సాయిబాబా ఆలయానికి అశ్వాపురంలోని పదో తరగతి 1985–86 బ్యాచ్‌కు చెందిన సింగ్ ప్రసాద్ దంపతులు ఆదివారం వెండితో తయారు చేసిన గోమాత విగ్రహాన్ని వితరణగా అందజేశారు. ఆలయ కమిటీ బాధ్యుడు సత్యప్రకాష్‌కు వితరణ అందజేశారు.

మెట్లు ఏర్పాటు చేయాలి

మణుగూరురూరల్: మణుగూరు పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ కూడలిలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మెట్లు ఏర్పాటు చేయాలని మాదిగ ఐక్యవేదిక నియోజకవర్గ అధ్యక్షుడు ఆర్.రామ్మూర్తి కోరారు. ఆదివారం స్థానిక మాదిగ ఐక్య వేదిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ అంబేడ్కర్ జయంతి, వర్ధంతి వేడుకల సందర్భంగా, పలు ప్రత్యేక కార్యక్రమాల నేపథ్యంలో ఎత్తులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించేందుకు ఇబ్బంది ఎదురవుతున్నాయని అన్నారు. సమావేశంలో నాయకులు గద్దల నాగేశ్వరరావు, బోయిళ్ల రమణయ్య, నల్లగట్ల రఘు, సిద్దెల తిరుమలరావు, పి.ప్రసాద్, విక్రమ్, కె.కృష్ణ, రాజేష్, రాము, వేణు, రమేష్ తదితరులు పాల్గొన్నారు

సందిగ్ధం వీడేనా..!?

- దశాబ్ద కాలమైనా పూర్తికాని వరద కాలువ పనులు
- పరిహారం పెంచాలని భూనిర్వాసితుల డిమాండ్
- ఇచ్చినంతే పుచ్చుకోవాలంటున్న ప్రభుత్వం
- ఇద్దరి నడుమ ఆగిపోయిన పనులు



పనులు ఆగిపోయిన వెంకమ్మ చెరువు వరద కాలువ ఇదే..

అశ్వారావుపేటరూరల్: వర్షాకాలంలో ఓ చెరువు అలుగు నుంచి పోయే వృథానీటిని మళ్లించి గిరిజన పంట పొలాలకు సాగునీరు అందించే ఉద్దేశంతో మొదలు పెట్టిన వరద కాలువ పనులు దశాబ్ద కాలం దాటిపోతున్నప్పటికీ పూర్తి కావడం లేదు. మరో పక్క ఈ వరద కాలువ తవ్వకాల్లో భూములు కోల్పోయిన గిరిజన రైతులకు నష్టపరిహారం సైతం రావడం లేదు.

అశ్వారావుపేట మండలం ఊట్లపల్లి గ్రామ సమీపంలోని వెంకమ్మ చెరువు అలుగు నుంచి వేలాది క్యూసెక్కుల వరదనీరు వాగుల్లో కలిసి వృథా అవుతోంది. ఈ వృథా జలాలను పంట పొలాలకు మళ్లిస్తే వందలాది గిరిజన భూములకు సాగునీరు అందుతాయి. ఇదే ఆలోచనతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2005 డిసెంబర్ 31వ తేదీన వరద కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పథకానికి వైఎస్సార్ హయాంలోనే రూ.13 కోట్ల వ్యయంతో నిధులు సైతం కేటాయించగా, కాంట్రాక్టర్ల జాప్యం చేశాడు. దీంతో ఈ పనులను 2009వ సంవత్సరంలో ఇరిగేషన్ శాఖ ద్వారా ఓ కాంట్రాక్టర్ ఒప్పందం చేసుకుని 2010లో కాలువ తవ్వకాల పనులు మొదలుపెట్టారు. దాంట్లో భాగంగా వెంకమ్మ చెరువు నుంచి(కేసప్పగూడెం) నుంచి దబ్బతోగు చెరువు వరకు 15 కిలో మీటర్లు, అక్కడి నుంచి లోతువాగు చెరువుకు మరో 7 కిలోమీటర్లు కలిపి మొత్తం 22 కిలోమీటర్ల దూరం వరకు పనులు చేపట్టాల్సి ఉంది. అందులో భాగంగా ఇప్పటి వరకు వరద కాలువ తవ్వకాల పనులు 18 కిలోమీటర్ల వరకు పూర్తి అయ్యాయి. కేవలం మూడు కిలోమీటర్ల వరకు పనులు మాత్రమే పూర్తి చేయాల్సి ఉంది. అలాగే లోతువాగు చెరువు వరకు మొత్తం 46 చోట్ల స్ట్రక్చర్లు, ఆక్విడెక్టులకు గాను మరో 10 మాత్రమే నిర్మించాల్సి ఉంది. ఈ పనులను పూర్తి చేస్తే వృథా నీరంతా కాలువల ద్వారా దబ్బతోగు, లోతువాగు చెరువులోకి చేరి దాదాపు 5వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. గిరిజనుల భూములకు సాగునీటి అవస్థలు తీరుతాయి. పంటలన్నీ పచ్చగా కళకళలాడుతాయి. కానీ ఆ చిన్న మొత్తంగా ఆగిపోయిన పనులు ముందుకు కదలడం లేదు.

నష్ట పరిహారమే అడ్డంకి..

వెంకమ్మ చెరువు వరద కాలువ పనులు వంద శాతం పూర్తి కావాలంటే భూములు కోల్పోయిన గిరిజన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాల్సి ఉంది. అటవీ శాఖ, ఇతర ఇబ్బందులు తొలగి పనులు దాదాపు పూర్తి అవుతున్న దశలో గిరిజన రైతులుకు నష్ట పరిహారం ఇవ్వడం జాప్యం జరిగిపోయింది. దాంతో మిగిలిన పనులు నిలిచిపోయాయి. ఈ వరద కాలువల పనుల్లో అశ్వారావుపేట మండలంలోని రామన్నగూడెం, దబ్బతోగు, దబ్బతోగు కాలనీ, మల్లాయిగూడెం, కామయ్యనగర్, వేదాంతపురం, దిబ్బగూడెం, వినాయకపురం, ఊట్లపల్లి గ్రామాలకు చెందిన 92 మంది రైతులకుగాను 42 ఎకరాల భూములకు నష్ట పరిహారం ఇవ్వాల్సి ఉంది. వీటిలో 20 ఎకరాలు పట్టా భూములు, మరో 22 ఎకరాలు అసైన్డ్ భూములకు నష్ట పరిహారాన్ని గిరిజన రైతులకు ఇవ్వాల్సి ఉంది. ఈ భూములకు పనులు మొదలు పెట్టిన సమయంలో ఎకరానికి రూ.1లక్ష 35వేలు చొప్పున ప్రభుత్వం కేటాయించగా, నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో జాప్యం జరిగింది. కాగా నాలుగేళ్ల క్రితం ఈ భూములకు నష్ట పరిహారం కింద ప్రభుత్వం పాత భూసేకరణ చట్ట ప్రకారం రూ.78లక్షల నిధులు మంజూరు చేయగా, బాధిత గిరిజన రైతులు తమకు కొత్త భూసేకరణ చట్టం కింద పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసి పరిహారం చెక్కులను స్వీకరించలేదు. రాష్ట్ర ప్రభుత్వం సీతారామ ప్రాజెక్ట్ భూ నిర్వసితులకు ఇస్తున్నట్లు ఎకరానికి రూ.8లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని పట్టుబట్టారు. దీనిపై పలుమార్లు గిరిజన రైతులు ఆందోళన చేయడంతోపాటు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ నాటి నుంచి పరిహారం నిధులు ప్రభుత్వ ఖాతాలోనే మూలుగుతున్నాయి. ఈ పరిహారాన్ని పెంచి ఇచ్చేలా ప్రభుత్వం ముందుకు రావడం లేదు. అటు బాధిత గిరిజన రైతులు సైతం పరిహారం పెంచి ఇవ్వాల్సిందేనని భీష్మించుకు కూర్చున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందుకొచ్చి పరిహారం సమస్యను పరిష్కరించాలని, తద్వారా రైతులకు సాగునీరు అందేలా చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఎకరానికి రూ.8 లక్షలు ఇవ్వాలి

వరద కాలువ కింద ఎకరం భూమి కోల్పోయాను. భూమి కోల్పోయి ఇప్పటికే 14 ఏళ్లు గడిచిపోగా నేటికీ నష్ట పరిహారం ఇవ్వలేదు. పరిహారం కోసం ఏళ్లుగా ప్రభుత్వ ఆఫీసుల చుట్టు తిరిగి విసిగిపోయా. ఎకరానికి రూ.8లక్షలతోపాటు, మా భూముల్లో మట్టి కుప్పలు వేసినందుకు పరిహారంగా రూ.40వేలు చొప్పున అదనంగా ఇవ్వాలి. కొత్త భూసేకరణ చట్ట ప్రకారం నష్ట పరిహారం ఇస్తేనే తీసుకుంటాం.

– నాగేశ్వరరావు, రామన్నగూడెం, బాధిత రైతు

ఏళ్లుగా తిప్పకుంటున్నారు

వరద కాలువ తవ్వకాల్లో ఎకరం పొలం పోయింది. కాలువ తవ్వే సమయంలోనే పరిహారం ఇస్తామని అధికారులు చెప్పారు. కానీ నేటికి నష్ట పరిహారాన్ని ఇవ్వలేదు. ఈ నష్ట పరిహారం కోసం ఏళ్లుగా అవస్థలు పడుతున్నాం. గిరిజనేతర రైతులకు ఆనాడే పరిహారం ఇచ్చి, గిరిజన రైతులకే నేటికి ఇవ్వలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకుని పరిహారాన్ని పెంచి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

– నారం ముత్యాలరావు, రామన్నగూడెం, బాధిత రైతు

నష్ట పరిహారం వల్లే జాప్యం

వరద కాలువలో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం సమస్య వల్లే పనులు ఆగాయి. పాత భూసేకరణ కింద భూములకు ప్రభుత్వం నష్ట పరిహారం మంజూరు చేసింది. కానీ బాధిత రైతులు తమకు కొత్త భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలని కోరారు. దాంతో పనులు ముందుకు సాగడం లేదు. పరిహారం పెంచే అంశం నా పరిధిలో లేదు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాం.

– కృష్ణ, డీఈ, నీటిపారుదల శాఖ, అశ్వారావుపేట

ముగిసిన 'వాయిస్ ఫర్ గర్ల్స్'



దమ్మపేట: అంకంపాలెం ఆశ్రమ పాఠశాలలోని ముగింపు సంబురాల్లో విద్యార్థినిలు..

దమ్మపేట: మండల పరిధిలోని అంకంపాలెం గ్రామంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వాయిస్ ఫర్ గర్ల్స్ ముగింపు సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో నాట్య ప్రదర్శనలు నిర్వహించారు. వాయిస్ ఫర్ గర్ల్స్ కార్యక్రమంలో నేర్పిన అంశాలైన బాలికల ఆరోగ్య జాగ్రత్తలు, అసమానతలు, కెరీర్ గైడెన్స్ తదితర అంశాలను నాట్య ప్రదర్శనలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బాలికలను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తోలెం వెంకటేశ్వర్లు, వార్డెన్ భవానీ, ఉపాధ్యాయులు శ్యామల, నాగేంద్రమ్మ, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి

భద్రాచలంటౌన్: బాలికల్లో అంతర్గతంగా దాగివున్న నైపుణ్యాన్ని వెలిగి తీసి వారిని విద్యతో పాలు అనిరంగాల్లో రాణించే విధంగా వారిని చైతన్య పరచడం కోసమే వాయిస్ ఫర్ గర్ల్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భద్రాచలం గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.దేవదాసు పేర్కొన్నారు. గత పది రోజులుగా పాఠశాలలో నిర్వహిస్తున్న వాయిస్ ఫర్ గర్ల్స్ ప్రోగ్రాం ముగింపు సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన ఎన్జీవో సంస్థ సభ్యులు బాలికలకు అనేక అంశాలపై అవగాహన కల్పించారని తెలిపారు. వాయిస్ ఫర్ గర్ల్స్ కార్యక్రమం నిర్వహించేందుకు సహకరించిన భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రుతో పాటు ప్రాజెక్ట్ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లకావత్ సరస్వతి, అనూష, మౌనిక, కావ్య, కుమారి, మహేశ్వరి, మానస, మౌనిక, వీణ, రాణి, అక్షయ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా జీఎంకు సన్మానం

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జీఎం దుర్గం రాంచందర్‌ను ఏరియా ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, పలువురు ఏరియా అధికారులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏరియా జీఎం రాంచందర్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో ఏరియా డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్, ఓసీ2 అడిషనల్ మేనేజర్ కల్యాణ్‌రామ్, ఏరియా ఎస్సీ, ఎస్టీ లైజన్ అధికారులు నరసింహారావు, సతీష్, అసోసియేషన్ సభ్యులు పీకా శంకర్, కోటపాల్, రమేష్, సీత, రాజలింగం, డాక్టర్ రమణయ్య, వెంకటరత్నం, వెంకటేశ్వర్లు, మార్క్స్ తదితరులు పాల్గొన్నారు.

దిశ ఫౌండేషన్ అధ్యక్షురాలికి..

అశ్వాపురం: దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలుగా ఎన్నికైన మండల కేంద్రానికి చెందిన అన్నపూర్ణమ్మను ఆదివారం దిశ ఫౌండేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో కాలువబజార్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సుజాత, మాలోత్ సువర్ణ, పసుపులేటి స్వర్ణ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

మణుగూరురూరల్: ప్రజా సమస్యలపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నేడు మేడారం సమ్మక్క–సారలమ్మ క్షేత్రం వద్ద ప్రారంభించే హాత్ సే హాత్ పాదయాత్రకు మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గురిజాల గోపి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు లక్ష్మణ్, షరీఫ్ నూహార్దిన్, సాంబయ్య, మోహన్, కిషన్, సత్తి, రవి, సందీప్ పాల్గొన్నారు.

పథకాలను వివరించాలి

అశ్వాపురం: బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తద్వారా బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, మహబూబాబాద్ పార్లమెంటు కన్వీనర్, ఐకార్ సభ్యుడు ముస్కు శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు తాటిపాముల అయిలయ్య అధ్యక్షతన ఆదివారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ప్రజా సమస్యలు తెలుసుకుని 'ప్రజాగోస–బీజేపీ భరోసా' కార్యక్రమాన్ని అన్ని పోలింగ్ బూత్‌లలో నిర్వహించాలన్నారు. బీజేపీ పినపాక అసెంబ్లీ కన్వీనర్ పున్నం భిక్షపతి, విస్తారక్ కొండి ప్రభాకర్‌రావు, జిల్లా కార్యదర్శి బత్తుల రామకృష్ణ, నాయకులు సురకంటి లింగారెడ్డి, సున్నం సారయ్య, కల్లూరి రామారావు, కొల్లు లింగారెడ్డి, సోమ కృష్ణకుమారి, కోలా భాస్కర్, పాటి వెంకటరెడ్డి, బండ్ల నాగేశ్వరరావు, జాలె రవీందర్‌రెడ్డి, మాదిరెడ్డి వెంకటరెడ్డి, జంపన్న, రామకృష్ణ, మార్కండేయులు, మురళి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవోదయ మోడల్ పరీక్ష

బూర్గంపాడు: సారపాకలోని బ్రిలియంట్ స్కూల్‌లో ఆదివారం జిల్లాస్థాయి నవోదయ మోడల్ పరీక్షను నిర్వహించారు. ఈ మోడల్ పరీక్షకు జిల్లా నుంచి 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ నెల 8వ తేదీ వరకు నవోదయ ప్రవేశ పరీక్షకు విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశముందన్నారు. నవోదయ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు అవగాహన కల్పించటంలో ఉపయోగకరంగా ఉంటుందని మోడల్ పరీక్షను ప్రతిఏటా నిర్వహిస్తున్నామన్నారు.

పాఠశాల నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ నిర్వహిస్తున్న పూర్వవిద్యార్థులు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలో శిథిలావస్థకు చేరిన సీఎస్ఐ పాఠశాలను పునఃనిర్మించడానికి పూర్వవిద్యార్థులు నడుంకట్టారు. అందులో భాగంగా ఆదివారం పాఠశాల ప్రదేశంలో భూమిపూజ నిర్వహించి నిర్మాణం ప్రారంభించారు. 1978లో 5వ తరగతి, 1980లో 5వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆర్థిక చేయూతనివ్వగా.. పనులు మొదలయ్యాయి. ఇంకా గడిచిన సంవత్సరాల్లో చదివిన ప్రతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి పాఠశాల పునర్నిర్మాణంలో పాల్గొని సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జానీపాషా, కందుకూరి సత్యగణేష్, కొర్రపాటి సూర్యప్రకాష్, ఐసెట్టి శంకర్రావు, యామని భాగ్యలక్ష్మి, లంక గజలక్ష్మి, ధనిశెట్టి కమలాదేవి, చుక్కా పద్మాలత, కుప్పిలి చిట్టిబాబు, వేముల వెంకటేశ్వరరావు, చిర్తాని రామారావు, అహ్మద్, కొంక అభిషేక్ పాల్గొన్నారు.

'భూనిర్వాసితులను మోసం చేసిన ప్రభుత్వం'

దుమ్ముగూడెం: సీతమ్మ సాగర్ ప్రాజెక్టు కోసం భూసేకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితులను మోసం చేసిందని దుమ్ముగూడెం, చర్ల మండలాల సీతమ్మ సాగర్ ప్రాజెక్టు భూ నిర్వాసితులు సంఘం అధ్యక్షుడు కొమరం దామోదర రావు విమర్శించారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం అధికారులు రైతులను మభ్యపెట్టి 200 అడుగులమేర మాత్రమే భూసేకరణ ప్రారంభించి అందుకు ఎకరానికి 8 లక్షల నష్టపరిహారం చెల్లించి దానకర్ణుడిని మించిన ప్రచారం చేసి పనులు ప్రారంభించిందన్నారు. చాపకింద నీరులా మరో 50 అడుగులమేర సర్వే నిర్వహింస్తోందని, దీంతో రైతులను అయోమయ స్థితిలో ఉన్నారని అన్నారు. అసలే ఎటూచాలని నష్టపరిహారంతోపాటు, గుట్టుచప్పుడు కాకుండా రెండవసారి భూసేకరణ చేసి రైతుల కుటుంబాల్లో ఆందోళన పడేవిధంగా చేస్తుందన్నారు. మరోపక్క మిగిలిన భూములకు సాగు నీరు అందించే విషయంలో ప్రభుత్వం మౌనం వహింస్తోందన్నారు. వర్షాకాలంలో వచ్చే పైనీటి మళ్లింపు విషయంలో ఎటువంటి హామీ ఇవ్వలేదని, ఆ నీరు మిగిలిన భూ భాగాన్ని ఆక్రమిస్తే వ్యవసాయ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఆ భూములకు కూడా నష్టం పరిహారం చెల్లిస్తారా లేదా అని రైతులు అయోమయంలో ఉన్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆందోళనలకు భరోసా ఇస్తూ, ప్రకటన చేయాలని, ప్రాజెక్టు డిజైన్‌ను ప్రజలముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

మణుగూరురూరల్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ యు.నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఈ మేరకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పీఏ హరికృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం కనీస వేతనం రూ.15,600లు, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19,500లు అమలు చేయాలని కోరారు. పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించడంతోపాటు వారిని అసిస్టెంట్ కార్యదర్శులుగా నియమించాలన్నారు. మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వై.రంగయ్య, రమేష్, వీరన్న, మణెమ్మ, సదానందం, సురేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏఐటీయూసీ జిల్లా నాయకులు యార్లగడ్డ భాస్కరరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ భాస్కరరావు మాట్లాడుతూ.. చాలీ చాలని వేతనాలతో కష్టతరంగా ఉన్న పంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరోగ్య భద్రత, బీమా తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పందేటి చెన్నారావు, ప్రభాకర్, వెంకటేశ్వరరావు, బసవయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు పొంగులేటి ఆత్మీయ సమ్మేళనం

దమ్మపేట: మండల కేంద్రంలో నేడు నిర్వహించే నియోజకవర్గస్థాయి పొంగులేటి ఆత్మీయ సమ్మేళనానికి, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ నాయకులు జారే ఆదినారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం దమ్మపేట మండల కేంద్రంలోని నెమిలిపేట గ్రామ శివారులో ఉన్న క్రీడా మైదానంలో పొంగులేటి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా మాజీ పార్లమెంట్ సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరై, ప్రసంగిస్తారని తెలియజేశారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

అశ్వారావుపేటరూరల్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నేడు దమ్మపేట మండలంలోని నెమలిపేట వద్ద నిర్వహిస్తున్న అశ్వారావుపేట నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి తరలిరావాలని ఆదివారం రైతు సమన్వయ సమితి బాధ్యుడు జూపల్లి రమేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని వినాయకపురం, ఆసుపాక, మామిళ్లవారిగూడెం, తిరుమలకుంట, నారాయణపురం, బచ్చువారిగూడెం, గుమ్మడవల్లి, అశ్వారావుపేటతోపాటు అన్ని గ్రామ పంచాయతీల్లో విస్తృతంగా పర్యటించారు. అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజయ భవానీ జాతర ప్రారంభం

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని నారంవారిగూడెం కాలనీ వద్దగల మేల్‌మరవత్తూర్ ఆదిపరాశక్తి విజయ భవాని అమ్మవారి జాతర ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఆలయ 17వ వార్షికోత్సవాల సందర్భంగా ఉదయం ఆలయంలో అమ్మవారికి కలశస్థాపన, అఖండ దీపారాధనతోపాటు ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం సామూహిక సహస్ర కుంకుమార్చలను చేశారు. సాయంత్రం సమయంలో అమ్మవారికి చండీ మూల మంత్ర సహిత వనదుర్గా హోమాలు చేసి, మంగళహారతులు పట్టారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గేదల విష్ణుమూర్తి, సరోజిని, ఆనంద్‌కుమార్–కళావతి, సురేష్ నాయుడు–పార్వతి దంపతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



అన్నపురెడ్డిపల్లి: ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరి ఉన్న అంకమ్మ తల్లి ఆలయంలో ఆదివారం నూతన జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో కార్యక్రమాలను వెల్లటూరి ప్రసాద్ ఆధ్వర్యంలోని అర్చక బృందం మంగళవాయిద్యాల నడుమ అత్యంత వైభోవపేతంగా జరిపించారు. ధ్వజస్థాపన అనంతరం ఆలయం ప్రాంగణంలో శ్రీ గోపయ్య, తిరుపతమ్మల తిరుకల్యాణాన్ని కనుల పండుగగా నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, మదన్‌లాల్, నియోజవర్గ నాయకులు జారే ఆదినారాయణ, దమ్మపేట జెడ్పీటీసీ పైడీ వెంకటేశ్వర్లు ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన ప్రజాప్రతినిధులను హరిహర ఫౌండేషన్ వ్యవస్థాపకులు, శివాలయ పునఃనిర్మాణకర్త మారగాని శ్రీనివాసరావు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పానుగంటి రాఘవులు, ఇనపనూరి రాంబాబు, చల్లా రమేష్, చిట్టిబొమ్మల కొటేశ్వరరావు, నస్రీద్దన్, చల్లపల్లి వెంకటేశ్వర్లు, రాంబాబు పాల్గొన్నారు.

ములకలపల్లి: మండలపరిధిలోని జగన్నాథపురంలో ఉన్న సీతా లక్ష్మణ హనుమత్ సమేత కోదండ రామ చంద్రస్వామి ఆలయంలో శిఖర ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కనుల పండువగా సాగింది. ఇటీవలే పునఃనిర్మించిన ఈదేవాలయంలో వేద పండితులు తొలుత శాస్త్రోక్తంగా పూజాధికాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త జలగం రాంబాబు చేతుల మీదుగా ఈ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని చేశారు. మూడు రోజులుగా ప్రత్యేక పూజలు చేసి, చివరి రోజైన ఆదివారం వేలాది మంది భక్తుల జయజయ ధ్వానాల నడుమ ధ్వజస్థంబాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం మహాఅన్నదానం చేశారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రహరీ లేక అవస్థలు



మండల పరిధిలోని నెల్లిపాకబంజర జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల ఎదుట ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. పాఠశాల ఎదుట మొండికుంట-సారపాక రహదారి వెంబడి ఉన్న పాఠశాల ప్రహరీ ఇటీవల జూలై నెలలో వచ్చిన గోదావరి వరదలకు కూలిపోయింది. ప్రహరీ లేక పాఠశాలకు రక్షణ లేకుండా పోయింది. జంతువులు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలకు గోడ నిర్మించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు కోరుతున్నారు. - అశ్వాపురం

ప్రశ్నించాల్సిన అధికారి: వీరస్వామి, ఎంఈఓ, అశ్వాపురం
ఫోన్ నంబర్: 9959087110